# సాక్షి నల్లగొండ

శనివారం । 4 । మార్చి । 2023






**గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్**

గంజాయి రవాణా చేస్తున్న అంతర్‌రాష్ట్ర నిందితుడిని నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు.

- 10లో



**పీజీ పరీక్షలు వాయిదా**

మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో పీజీ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి రమేష్ తెలిపారు.

- 10లో

గరిష్టం/కనిష్టం

37° / 18°

**వాతావరణం**

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### గుత్తాను కలిసిన డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్



డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌ను సన్మానిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ : నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రానికి వచ్చిన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్.. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకుముందు తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు వెలుగు రవి ముదిరాజ్, వెంకట్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్, జగన్, బొక్క శ్రీనివాస్ ముదిరాజ్, ఆకుల రాజేష్, హనుమయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### రిజర్వాయర్ పనులను అడ్డుకోవద్దు

దేవరకొండ : మండల పరిధిలోని గొట్టిముక్కల రిజర్వాయర్ నిర్మాణ పనులను భూ నిర్వాసితులు అడ్డుకోవద్దని ప్రాజెక్ట్ డీఈ కరుణసాగర్ కోరారు. శుక్రవారం గొట్టిముక్కల రిజర్వాయర్ వద్ద పనులను అడ్డుకునేందుకు వచ్చిన పలువురు భూ నిర్వాసితులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్వాసితులకు చట్టానికి లోబడి పరిహారం అందజేస్తుందని తెలిపారు. కాగా.. రిజర్వాయర్ నిర్మాణ పనులకు ఆటంకం కలిగిస్తున్నారన్న విషయం తెలుసుకున్న దేవరకొండ పోలీసులు రిజర్వాయర్ ప్రాంతానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు.

### దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం నల్లగొండ ఆధ్వర్యంలో నిర్వహించే యువ సంవాద్ ఇండియా కార్యక్రమానికి యువజన సంఘాలు, మహిళా మండలి, ఎన్జీవోస్ ఇతర సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువజన అధికారి ప్రవీణ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 14వ తేదీలోగా నల్లగొండ యువ కేంద్ర కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

### ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

నల్లగొండ రూరల్, మర్రిగూడ : ప్రతి గ్రామంలో రోజూ వంద మందికిపైగా కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నల్లగొండ, మర్రిగూడలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం పెరుగుతుందన్నారు. అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని, నర్సరీలో మొక్కలు వంద శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మర్రిగూడ మండంలోని వట్టిపల్లిలోని నర్సరీ, క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్యక్రమాల్లో మర్రిగూడ తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓలు శ్రీనివాస్‌రెడ్డి, జె.వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓలు మాధవరెడ్డి, ఝాన్సీ, ఏపీఓలు స్ఫూర్తి, వెంకటేశం, ఏపీఎంలు సైదులు, హరి తదితరులు పాల్గొన్నారు.

### రైతుల అనుభవాలు తెలుసుకోవాలి

త్రిపురారం : వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్ర స్థాయిలో రైతులు వ్యవసాయ అనుభవాలను తెలుసుకోవడం అవసరమని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ శాస్త్రవేత్త పల్లవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దుగ్గెపల్లి గ్రామంలో పాలెం వ్యవసాయ కళాశాల విద్యార్థులు కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులతో క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల సాగులో రైతులు అవలంబిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు సందీప్, శివ తేజ, విశాల్, వంశీ, తరుణ్, అక్బర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఛాన్స్ ఎవరికో!

- ఖాళీ అవుతున్న ఎలిమినేటి కృష్ణారెడ్డి స్థానం
- ఇప్పటికే వెలువడిన ఎన్నికల షెడ్యూల్
- పదవి కోసం ఉమ్మడి జిల్లా నుంచి పలువురి ప్రయత్నాలు
- అధినేత ఎవరికి అవకాశం ఇస్తారోనని చర్చ




సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఈసారి ఎమ్మెల్సీ పదవి జిల్లాలో ఎవరిని వరిస్తుందన్న చర్చ బీఆర్‌ఎస్ పార్టీలో జోరుగా సాగుతోంది. భువనగిరి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి పదవీ కాలం ఈ నెలతో ముగుస్తున్నందున ఉమ్మడి జిల్లాకే మళ్లీ ఎమ్మెల్సీ పదవి వస్తుందనే అంచనాలతో ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. కొందరు నేరుగా సీఎం కేసీఆర్‌ను కలిసి విజ్ఞప్తులు చేస్తుండగా, మరికొందరు జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని కలిసి తమ మనసులో మాట చెప్పుకుంటున్నారు. ఇంకొందరు మంత్రి హరీశ్‌రావు ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు.

**బీసీలకే ఇస్తారని జోరుగా చర్చ**

ఉమ్మడి జిల్లాలో ఖాళీ అవుతున్న స్థానంలో ఈసారి బీసీలకు ఇస్తారనే అంచనాల్లో నేతలు ఉన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే రెడ్డి సామాజిక వర్గం నుంచి ప్రాతినిధ్యం ఉంది. గతేడాదే మంత్రి జగదీశ్ రెడ్డి అనుచరుడు ఎంసీ కోటిరెడ్డికి స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. అలాగే శాసనమండలి చైర్మన్ పదవి గుత్తా సుఖేందర్‌రెడ్డికి ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికే సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీ అవకాశం కల్పిస్తారన్న చర్చ జోరుగా సాగుతోంది.

**మునుగోడులో ఇచ్చిన హామీ మేరకు..**

మునుగోడు ఎన్నికల సమయంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. దీంతో గౌడ సామాజిక వర్గం నుంచి పార్టీకి ఎలాంటి నష్టం జరగకుండా బీజేపీలో ఉన్న బూడిద భిక్షమయ్యగౌడ్‌ను బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకున్నారు. బీఆర్‌ఎస్‌లో చేరే సందర్భంలో అధినేత కేసీఆర్.. భిక్షమయ్యగౌడ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన కూడా తనకు ఎమ్మెల్సీ వస్తుందన్న ధీమాలో ఉన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి కూడా ఎమ్మెల్సీ పదవి కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కూడా తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తనకు ఎమ్మెల్సీగా మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ పదవి కోసం చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు మునుగోడు ఎన్నికల సమయంలో పద్మశాలీలకు కూడా రాష్ట్ర స్థాయి పదవి ఇస్తానని అధినేత హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ సామాజికవర్గం నుంచి నారాయణపురం మాజీ జెడ్పీటీసీ బోళ్ల శివశంకర్ ప్రయత్నాలు చేస్తున్నారు.

**చకిలంకు ఎమ్మెల్సీ అవకాశం వచ్చేనా?**

పార్టీ ఆవిర్భావం నుంచి నుంచి పనిచేస్తున్న చకిలం అనిల్‌కుమార్‌కు ఎమ్మెల్సీ పదవి ఈసారైనా దక్కుతుందా? లేదా? అన్న చర్చ జరుగుతోంది. ఇటీవలే గళం పెంచి మరీ.. ఉద్యమకారులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించిన ఆయన ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ మేరకు సీఎం కేసీఆర్ కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ కావాలని తీవ్రంగా ప్రయత్నించారు. అధిష్టానం కంచర్ల భూపాల్‌రెడ్డికి అవకాశం ఇచ్చింది. దీంతో చకిలం మనస్థాపానికి గురై రెబల్‌గా పోటీ చేయడానికి ప్రయత్నించగా, సీఎం కేసీఆర్ ఆయన్ని ప్రగతి భవన్‌కు పిలిపించుకొని మాట్లాడారు. భూపాల్‌రెడ్డిని గెలిపిస్తే ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పటికీ నెరవేరలేదు. ప్రస్తుతం కృష్ణారెడ్డి స్థానం ఖాళీ అవుతున్న నేపథ్యంలో తనకు అవకాశం కల్పించాలని చకిలం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

**6న నోటిఫికేషన్**

ఈ నెలలో ఖాళీ అవుతున్న.. ఎమ్మెల్యేల కోటాలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూలు ప్రకటించింది. ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల కాబోతోంది. పదవీ కాలం ముగుస్తున్న ముగ్గురిలో భువనగిరి చెందిన ఎలిమినేటి కృష్ణారెడ్డి ఉన్నారు. ఎన్నికల షెడ్యూలు ప్రకారం ఈ నెల 13న నామినేషన్లకు చివరితేదీ.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నల్లగొండ : కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని బొట్టుగూడలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన వారంతా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి చూపునకు సరిపోయే రీడింగ్ అద్దాలను వెంటనే ఇస్తారని చెప్పారు. ప్రిస్క్రిప్షన్ అద్దాలను కూడా దశల వారీగా అందజేస్తామన్నారు. కంటి పరీక్షల కోసం వచ్చిన ప్రజలతో క్యాంపు ఏర్పాటు, నిర్వహణ, పరీక్షల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## యాభై ఏళ్ల కల నెరవేరుతున్న వేళ..

- నందికొండ వాసులకు ఇళ్ల రిజిస్ట్రేషన్
- సర్వేయర్ లొకేషన్ మ్యాపు ఆధారంగా ప్రక్రియ



లొకేషన్ మ్యాపులను గీస్తున్న సర్వేయర్లు

నాగార్జునసాగర్ : నందికొండ వాసుల సొంతింటి కల నెరవేరుతోంది. గురువారం నుంచి పెద్దవూర తహసీల్దార్.. నిడమనూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. మొదటి రోజు 10 మందికి రిజిస్ట్రేషన్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 59జీఓ కింద దరఖాస్తు చేసుకున్న వారికి ధర నిర్ణయించి చలానా రూపేనా నగదు చెల్లించేందుకు 2022 డిసెంబర్ నుంచి 2023 ఫిబ్రవరి 25 వరకు మూడు నెలల గడువు ఇచ్చి మూడు దఫాలుగా చెల్లించేందుకు అవకాశం కల్పించింది. పూర్తిస్థాయిలో నగదు చెల్లించిన ఇంటి యజమానుల వద్దకు ముందుగా సర్వేయర్‌ను పంపి లొకేషన్ మ్యాపు గీయిస్తున్నారు. దాని ప్రకారం తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

**631మందికి డిమాండ్ నోటీసులు..**

నందికొండలో ఇళ్ల కోసం 1,468 మంది దరఖాస్తు చేసుకోగా 631మందికి డిమాండ్ నోటీసులు పంపారు. సుమారుగా ఇప్పటి వరకు 600మందికి పైచిలుకు మంది చలానాలు చెల్లించినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. వీరందరికీ వరుసక్రమంలో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. మొదటగా సర్వేయర్ లొకేషన్ మ్యాపు ఇచ్చిన తర్వాతనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలవుతోంది. రిజిస్ట్రేషన్‌కు ఒకేసారి అందరూ రాకుండా రోజూ కొంత మందికి సమాచారం అందిస్తున్నారు.

## పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- 2124 మెగావాట్లకు చేరిన వినియోగం
- గతేడాది ఇదేరోజుతో పోల్చితే 443 మెగావాట్లు అధికంగా వాడకం

నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ప్రస్తుతం ఎండలు కూడా ముదురుతున్నాయి. ఇప్పటికే 36 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరడంతో ఏసీలు, కూలర్ల వాడకం మొదలైంది. ఈసారి రబీలో సాగు పెరగడంతో మోటర్లను పెద్ద ఎత్తున వాడుతున్నారు. దీంతో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగింది. గతేడాది మార్చి 3వ తేదీన మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో 1,681 మెగావాట్ల విద్యుత్ వినియోగం కాగా.. శుక్రవారం 2,124 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరిగింది. గతేడాదితో పోల్చితే 443 మెగావాట్ల విద్యుత్‌ను అధికంగా వినియోగమైంది. సోలార్ విద్యుత్‌తో పోల్చితే ఇది 600 మెగావాట్ల వరకు డిమాండ్ పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. గురువారం కూడా 2,079 మెగావాట్ల విద్యుత్ వాడకం జరిగింది. సగటున రోజుకు 45 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని ఆ శాఖ పేర్కొంటోంది.

## యాసంగి సీఎంఆర్ గడువు పొడిగింపు

నల్లగొండ : 2021–22 యాసంగి ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ గడువును మార్చి చివరి వరకు పొడిగించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాసంగిలో 2.23 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు 1.84లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చారని.. ఇంకా 0.39 లక్షల మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉందని వివరించారు. 2022–23 వానాకాలం సీఎంఆర్‌కు సంబంధించి 2.75లక్షల మెట్రిక్ టన్నులకు గాను ఇప్పటివరకు 0.83 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చారని.. ఇంకా 1.92లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే తదితరులు

## సామాన్యులపై భారం మోపుతున్న మోదీ

- దేశ సంపదను దోస్తులకే పంచుతున్నారు
- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- గ్యాస్ ధర పెంపుపై నల్లగొండలో బీఆర్‌ఎస్ భారీ ధర్నా
- తరలివచ్చిన మహిళలు, పార్టీ శ్రేణులు

నల్లగొండ : దేశ ప్రధాని నరేంద్ర మోదీ సామాన్యులపై మోయలేని భారాలు మోపుతున్నారని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్లగొండలోని గడియారం సెంటర్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రధాని అయ్యాక.. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర పెరగకున్నా.. పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం రెట్టింపు అయ్యాయన్నారు. దీని వల్ల అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయన్నారు. మోదీ రాకముందు రూ.350 ఉన్న సిలిండర్ ధర రూ.1,150 అయ్యిందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆదాయాన్ని సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందజేస్తుండగా.. ప్రధాని మోదీ దేశ సంపదను దోస్తులకు దోచి పెడుతున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా సీఎం కేసీఆర్ సంక్షేమం గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. అప్పట్లో మాజీ మంత్రి జానారెడ్డి తనకు ఏం మేలు జరిగిందని అడిగితే.. 24 గంటలు పాటు విద్యుత్ సరఫరా వల్ల ఆయన జనరేటర్‌కు అయ్యే డీజిల్ ఖర్చు తగ్గిందని చెప్పానని పేర్కొన్నారు. ప్రధాని ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని చెప్పారు. ప్రజలపై భారం మోపుతున్న బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మార్కెట్ చైర్మన్ బొర్ర సుధాకర్, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**ఖాళీ సిలిండర్లతో నిరసన**

గ్యాస్ ధరల పెంపు నిరసిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన ధర్నాకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఖాళీ సిలిండర్లతో ధర్నాలో పాల్గొన్నారు. 'మోదీ మమ్ములను బతకనివ్వండి.. కేసీఆర్ పెట్టింది తిననివ్వండి..' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.



ధర్నాకు భారీ సంఖ్యలో హాజరైన మహిళలు

## డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు

- నల్లగొండ, మిర్యాలగూడలో లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- అనర్హులకు వచ్చాయని పలువురి ఆందోళన



డ్రా తీస్తున్న రెవెన్యూ అధికారులు

నల్లగొండ : నల్లగొండ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి అధికారులు శుక్రవారం లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. పట్టణంలో నిర్మించిన 552 ఇళ్ల కోసం మొత్తం 13,410 మంది దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు విచారణ చేపట్టి వారిలో 4,205 మంది అర్హులుగా గుర్తించారు. శుక్రవారం పట్టణంలోని 48 వార్డులకు సంబంధించి 12 ఫంక్షన్ హాళ్లలో లబ్ధిదారుల ఎంపికకు లక్కీ డ్రా నిర్వహించి ఇళ్ల కేటాయించారు.

**కేంద్రాల వద్ద ఆందోళన**

లక్కీడ్రా ద్వారా ఇళ్లు పొందిన వారంతా అనర్హులేనని కొందరు అర్హులు కేంద్రాల వద్ద ఆందోళనకు దిగారు. అధికారులు తప్పుల తడకగా సర్వే చేశారని మండిపడ్డారు. రీ సర్వే చేసి నిజమైన అర్హులను గుర్తించిన తర్వాతే లక్కీడ్రా ద్వారా ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ కాలనీల్లో ఏళ్ల తరబడి ఉన్నవారికి కాకుండా ఇటీవల వచ్చిన వారికి ఇళ్లు రావడంపై కౌన్సిలర్లు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

**ముగిసిన డబుల్ బెడ్ రూం ఇళ్ల డ్రా**

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తుంగపాడు వద్ద నిర్మించిన 560 డబుల్ బెడ్ రూం ఇళ్లకు శుక్రవారం మున్సిపాలిటీలోని 48 వార్డుల్లో డ్రా తీశారు. ఈ డ్రాలో ఇళ్లు వచ్చిన వారు సంతోష పడుతుండగా అర్హుల జాబితాలో పేరుండి డ్రాలో రాని వారు బాధపడ్డారు. పలు వార్డుల్లో ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ప్రజలు అధికారులను నిలదీశారు. ముత్తిరెడ్డికుంటలో 40 ఏళ్లుగా అద్దెకు ఉంటున్నవారికి ఇల్లు రాలేదని.. ఇల్లు ఉన్న వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే.. ప్రజల సమక్షంలో డ్రా తీస్తున్నామని.. దీనిలో ఎవరి ప్రమేయం లేదని, అది అదృష్టంగానే భావించాలని అధికారులు పేర్కొన్నారు.

# డంపింగ్ యార్డులను తరలించాలి

- కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి
- కుక్కలు, కోతులు, పందుల బెడద నివారించాలి
- సాక్షి ఫోన్ ఇన్‌లో సమస్యలు ఏకరువు పెట్టిన చిట్యాల పట్టణవాసులు
- దశల వారీగా పరిష్కరిస్తామన్న కమిషనర్

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేస్తున్న రెండు డంపింగ్ యార్డుల వల్ల కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నాం. వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలి. కుక్కలు, పందులు, కోతులతో ఇబ్బందులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని చిట్యాల మున్సిపాలిటీ వాసులు కోరుతున్నారు. శుక్రవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డికి సమస్యలు తెలియజేశారు.



సాక్షి ఫోన్‌ఇన్

ఫోన్‌లో ప్రజా సమస్యలు వింటున్న కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి

**ప్రశ్న** : భాగ్యనగర్ కాలనీలో సీసీ రోడ్లు వేయాలి, నల్లా కనెక్షన్లు ఇవ్వాలి. కాలనీలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి.

–కుకుడాల గోవర్ధన్, యాదగిరిరెడ్డి

**కమిషనర్** : భాగ్యనగర్ కాలనీలో అవసరమైన చోట సీసీ రోడ్లు నిర్మిస్తాం. నిబంధనల మేరకు నల్లా కనెక్షన్లు ఇస్తాం. రెండు నెలల్లో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తాం.

**ప్రశ్న** : సాయి బృందావనం కాలనీలో డ్రెయినేజీలు పూడిక తీయడం లేదు. పందులు, కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం.

– కృష్ణమోహన్, కూరెళ్ల యాదయ్య

**కమిషనర్** : వార్డులో వెంటనే సిబ్బందిని పంపించి డ్రెయినేజీ శుభ్రం చేయిస్తాం. పందుల కాపరులకు ఇప్పటికే నోటీసులు అందజేశాం.

**ప్రశ్న** : శివనేనిగూడెంలో ఎస్సీ కాలనీలో ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ హైటెన్షన్ తీగలను తొలగించాలి.

– ఎర్ర మహాలింగం,శివనేనిగూడెం.

**కమిషనర్**: వెంటనే విద్యుత్ అధికారులకు సమస్యను తెలియపర్చి, సమస్యను పరిష్కరిస్తాం.

**ప్రశ్న** : పట్టణంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా హైవేపై జంక్షన్‌లో ప్రమాదాలు నివారించాలి.

–దాసరి నర్సింహ.

**కమిషనర్** : హైవే రోడ్డుపై జంక్షన్‌లో ట్రాఫిక్ సిబ్బంది ఏర్పాటుకుగాను పోలీసు శాఖకు తెలియజేస్తాం.

**ప్రశ్న** : పదో వార్డులోని పలు వాటర్ ట్యాంకులకు ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేక నీరు వృథా అవుతోంది. వార్డులో కుక్కలు, కోతుల బెడద తొలగించాలి.

– చికిలంమెట్ల అశోక్

**ప్రశ్న** : ఒకటవ వార్డులలో డంపింగ్ యార్డులతో దుర్వాసనతో పాటు, కాలుష్యంతో అనారోగ్యం పాలవుతున్నాం. పొలాలు దెబ్బతింటాయి. డంపింగ్ యార్డును మరోచోటుకు తరలించాలి.

– ఎద్దులపురి క్రిష్ణ, కన్నెబోయిన మహాలింగం, నోముల సత్యనారాయణ.

**కమిషనర్** : డంపింగ్ యార్డుల నిర్మాణాని ప్రభుత్వ స్థలాల కోసం తహసీల్దార్‌ను అడుగుతాం. మరోచోట స్థలం కేటాయిస్తే అక్కడే డంపింగ్ యార్డులను ఏర్పాటు చేస్తాం.

**కమిషనర్** : వాటర్ ట్యాంకులకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేయిస్తాం. కుక్కలు, కోతుల బెడద నివారించేందుకు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న**: వైకుంఠధామం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలు ఎప్పుడు పూర్తి చేస్తారు. కనకదుర్గా ఆలయం పరిసరాల్లో ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధించాలి.

– కూరెళ్ల శ్రీను

**కమిషనర్** : వైకుంఠధామం పనులు 85 శాతం పూర్తయ్యాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు కొనసాగుతున్నాయి. ఆలయం సమీపంలో రాజకీయ ఫ్లెక్సీల నివారణకు చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న** : పట్టణంలో కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

– పోకల అశోక్

**కమిషనర్** : ప్రభుత్వ ఆదేశాల మేరకు చెట్ల పెంపకం చేపడుతాం. ప్రభుత్వం ఆదేశిస్తే కోనోకార్పస్ చెట్లపై తదుపరి చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న** : శివనేనిగూడెంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి.

– నరేష్‌గౌడ్, రుద్రవరం కుమార్, నవీన్

**కమిషనర్** : శివనేనిగూడెం కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పటికే టెండర్లు కూడా పూర్తయ్యాయి. త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

**ప్రశ్న** : పట్టణంలోని లక్ష్మీగార్డెన్ సమీపంలో విద్యుత్ స్తంభాలకు కరెంట్ కనెక్షన్ ఇవ్వాలి

– నరేష్

**కమిషనర్**: వెంటనే విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయిస్తాం.

**ప్రశ్న** : వేణుగోపాల స్వామి కాలనీలో వీధి లైట్లు వెలుగడం లేదు.

– కుర్రె రవి

**కమిషనర్** : వెంటనే వీధి లైట్లు వేయిస్తాం.

**ప్రశ్న**: పరిశ్రమల వల్ల ఒకటవ వార్డులోని ఇళ్లలోకి బూడిద వస్తోంది.

– గుండాల నరేష్‌గౌడ్, రాధారపు వెంకన్న, సుధాకర్‌రెడ్డి.

**కమిషనర్** : కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలకు నోటీసులు అందజేస్తాం.

## క్లుప్తంగా

### ట్రాక్టర్ కిందపడి బాలుడు మృతి


సన్మత్‌రాణా మృతదేహం

నేరేడుచర్ల : ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన శుక్రవారం నేరేడుచర్ల మండలం దిర్శించర్ల శివారులో గల ఇటుక బట్టీల వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివారాలు ఇలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రాణామాదవ్ కొన్ని నెలలుగా దిర్శించర్ల శివారులో ఇటుకబట్టీలో పనిచేస్తున్నాడు. మాదవ్ కుమారుడు సన్మత్ రాణా(5) బట్టీల వద్ద అడుకుంటుండగా డ్రైవర్ మల్లికార్జున్‌రావు అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా ట్రాక్టర్‌ను రీవర్స్ తీస్తున్న సమయంలో బాలుడిని ఢీకొట్టాడు. దీంతో బాలుడు సన్మత్ రాణా తలకు తీవ్ర గాయం కావడంతో నేరేడుచర్లలోని ఓ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం


108 కలశాలకు పూజలు చేస్తున్న ఆచార్యులు


శతఘటాభిషేకానికి పూజలు చేస్తున్న ఆచార్యులు

- అష్టోత్తర శతఘటాభిషేకం.. రాత్రి శృంగార డోలోత్సవం
- యాదాద్రిలో 11 రోజుల ఉత్సవాలకు వైభవంగా ముగింపు పలికిన ఆచార్యులు

యాదగిరిగుట్ట: పంచనారసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. 11 రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన యాదగిరీశుడి బ్రహ్మోత్సవాలకు ఆచార్యులు స్వామి అమ్మవార్లకు శృంగార మహోత్సవాన్ని నిర్వహించి ఉత్సవాలకు పరిసమాప్తి పలికారు. ఉదయం ఆలయంలో వైభవోపేతంగా శతఘటాభిషేకం పూజ జరిపించారు. ఈ విశేష వేడుకల్లో అలయ ఈఓ. గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ఏసీపీ సైదులు, ఆలయాధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.

**108 కలశాలతో...**

గత నెల 21వ తేదీన స్వస్తివాచనంతో యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలకు ఆచార్యులు శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం ఉదయం ప్రధానాలయ ముఖ మండపంలో 108 బంగారు, వెండి కలశాలను పూజించారు. ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాందూరి వెంకటచార్యులు, అర్చకులు, యాజ్ఞాచార్యులు, పారాయణికులు పాంచరాత్ర ఆగమశాస్త్ర రీత్యా ఈ వేడుకను జరిపించారు. ప్రధాన కలశంతో పాటు 108 కలశాలను తొమ్మిది వరుసలుగా పేర్చి, ఒక్కో వరుసలో 12 కలశాలను పెట్టి పూజించారు. అంతకు ముందు ముఖ మండపంలో హోమం నిర్వహించి, పూర్ణాహుతి చేపట్టారు. శ్రీస్వామి అమ్మవార్లకు పంచామృతాలు, ఏలాలవంగాది చూర్ణ జలములతో, మంత్ర పూర్వక జపములతో అభిషేకించారు. అనంతరం బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న యజ్ఞచార్యులు, పారాయణికులు, అధికారులకు, సిబ్బందికి సన్మానం చేసి ఉత్సవ సమాప్తి సూచకంగా మంగళ నీరాజనములు అర్చకస్వాములచే నిర్వహించారు. ఈ వేడుకలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

**ఆలయంలో రాత్రి**

బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు నిత్యారాధనలు అనంతరం రాత్రి 9.30 గంటలకు స్వామి వారి శృంగార డోలోత్సవం జరిపించారు. కల్యాణ దంపతులైన స్వామి అమ్మవార్లను ఊయలలో వేంచేపు చేసి లాలి పాటలతో, భక్తి గీతములతో సంకీర్తన గావించారు. ఊయలలో పవళించిన స్వామి వారిని దర్శిస్తే సర్వవిధ దోషములు తొలగి భక్తుల మనోరథములు నెరవేరగలవని ఈ శృంగార డోలోత్సవ వేడుక నిర్వహించినట్లు ఆచార్యులు వెల్లడించారు. శాంతి, సుఖ, సౌజ్యములు కలుగునని ఆగమశాస్త్రాలు పేర్కొనుచున్నవి.


స్వామివారి అభిషేకానికి సిద్ధం చేసిన కళాశాలు

**ముగిసిన సాంస్కృతిక కార్యక్రమాలు**

ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం రాత్రి వైభవోపేతంగా ముగిశాయి. రాత్రి 9గంటల నుంచి లక్షణాదేవి బృందం స్వామివారి శృంగార డోలోత్సవంలో భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచార్యులు శృంగార డోలోత్సవం నిర్వహిస్తున్న సమయాన సంగీత కార్యక్రమం ఆకట్టుకుంది.

**స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు**

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, సినీ నటుడు జగన్, యాదాద్రి భువనగిరి జిల్లా జడ్జి బాలభాస్కర్‌లు శుక్రవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు సంప్రదాయంగా వీరికి స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.


ప్రధాన కలశాన్ని తీసుకెళ్తున్న ఆచార్యులు, అనువంశిక ధర్మకర్త, ఈఓ

# ట్యాంకర్‌తో వరిపంటకు నీరు


తన పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న రైతు శంకర్

మునుగోడు : ఎండల తీవ్రతకు అప్పుడే అక్కడక్కడ భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. మొన్నటి వరకు పుష్కలంగా నీరుపోసిన వ్యవసాయ బోర్లు ఒక్కసారిగా తగ్గిపావడంతో రైతులు వరి పంటను కాపాడుకునేందుకు కష్టాలు పడుతున్నారు. ఒకపక్క విద్యుత్ కోతలు, మరోపక్క భూగర్భ జలాలు అడుగంటడంతో వరి పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు ఆందోళనచెందుతున్నారు. మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన రైతు కట్టికుంట్ల శంకర్ మూడు ఎకరాల్లో వరి సాగుచేశాడు. ఆ పంటకు రెండు బోర్ల నుంచి నీరు పెడుతున్నాడు. అయితే, తాను పంట సాగు చేసిన నెల రోజులకే బోర్లలో నీరు తగ్గుతూ వస్తుండటంతో ఇటీవల రూ.లక్షా 20వేలు ఖర్చు చేసి ఐదు బోర్లు వేశాడు. కానీ, ఏ ఒక బోరులోనూ చుక్క నీరు రాలేదు. దానికి ఉన్న రెండు బోర్లలో ఒకటి పూర్తిగా ఎండిపోయింది. దీంతో మూడు ఎకరాల్లో ఎకరంన్నర పొలానికి నీరు లేకుండా పోయింది. మరో నెల రోజులల్లో చేతికి వచ్చే పొలం ఎండిపోతే తనకు నయాపైసా రాదని, దానిని ఎలాగైనా కాపాడుకోవాలని శంకర్.. నెలకు రూ.15వేల చొప్పున ఓ వాటర్ ట్యాంకర్ అద్దెకు తీసుకున్నాడు. అందులో రోజుకు రూ.500 డీజిల్‌కు ఖర్చు చేస్తూ ట్యాంకర్‌లో నీరు నింపాకొని తీసుకొచ్చి తన పొలానికి పెడుతున్నాడు. ఇలాంటి పరిస్థితి మరికొంత మంది రైతులు కూడా ఎదుర్కొంటున్నారు.

# ఆలయ అధికారులపై భక్తుల ఆగ్రహం

- ముందస్తు సమాచారం లేకుండానే దర్శనాలు బంద్


ఎస్‌పీఎఫ్ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ అధికారుల తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం ఉదయం స్వామి అమ్మవార్లకు శతఘటాభిషేకం పూజను ఆచార్యులు నిర్వహించారు. ఈ సమయంలో భక్తులకు దర్శనాలను బంద్ చేశారు. అప్పటికే ఉదయం 9 నుంచి 10గంటల వరకు బ్రేక్ దర్శనాల కొనసాగుతుండటంతో ధర్మదర్శనాలు బంద్ చేశారు. 10 గంటలకు ధర్మదర్శనాలను కొనసాగించాల్సిన అధికారులు.. శతఘటాభిషేకం ప్రారంభం కావడంతో బంద్ చేశారు. అప్పటికే గంటల తరబడి క్యూలైన్‌లో భక్తులు నిల్చున్నారు. దర్శనాలు బంద్‌చేస్తే క్యూలైన్‌లో నిల్చునేది ఏలా అంటూ అక్కడున్న ఎస్‌పీఎఫ్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అనంతరం అధికారులకు భక్తులకు శ్రీస్వామి వారి దర్శనాన్ని కల్పించారు.

## భర్తకు తలకొరివి పెట్టిన భార్య

యాదగిరిగుట్ట రూరల్: అనారోగ్యంతో మృతిచెందిన భర్తకు భార్య తల కొరివి పెట్టింది. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మారబోయిన నర్సయ్య (59) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి సమయంలో గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. అతనికి పిల్లలు లేకపోవడంతో, అనాథ బాలుడిని పెంచుకుంటున్నారు. మృతి చెందిన భర్తకు భార్య విజయలక్ష్మి తల కొరివి పెట్టింది.



## విగ్రహాలకు నిప్పుపెట్టిన దుండగులు

ఆత్మకూరు (ఎస్) (సూర్యాపేట) : మండల కేంద్రంలోని శివాలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దేవుడి విగ్రహాలను తగులబెట్టారు. స్థానికులు భక్తులు తెలిపిన వివరాల ప్రకారం..ఆలయంలో దీపం వెలిగించేందుకు సిద్ధంగా ఉంచిన నూనెను విగ్రహాల మీద చల్లి నిప్పంటించారని తెలిపారు. దేవాలయంలో హుండీ కన్పించడం లేదని వెండి విగ్రహాలు సైతం కాలినట్లు తెలిపారు. ఘటనపై స్థానిక భక్తులు నగిరే పర్వతాలు, తండు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.
సినట్లు తెలిపారు.

## రిఫ్రిజిరేటర్ పేలి ఆస్తి నష్టం


దగ్ధమైన పత్తి, ఇతర వస్తువులు

మునుగోడు: మండలంలోని చొల్లేడు గ్రామంలోని ఓ ఇంట్లో రిఫ్రిజిరేటర్ పేలి ఆస్తి నష్టం సంభివించింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వనం లింగయ్య ఇంట్లోని ఫ్రిజ్ గురువారం రాత్రి ఒకసారిగా పేలింది. దీంతో ఆ ఇంట్లో ఉన్న దాదాపు 10 క్వింటాళ్ల పత్తితో పాటు వంట సామగ్రి, దుస్తులు, ఇతర వస్తువులు దగ్ధమైయ్యాయి. అంతే కాకుండా ఇల్లు గోడలు పగులు పట్టాయి. ఫ్రిజ్ పేలిన సమయంలో ఇంట్లోని వారంతా తన తల్లి ప్రథమ వర్ధంతి సందర్భంగా సమాధి వద్ద కొవ్వత్తులు వెలిగించేందుకు వెళ్లారు. ప్రమాదంలో దాదపు రూ. 70వేలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

మోత్కూర్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈసంఘటన మోత్కూర్ మండలంలోని సదర్శాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దొండ యాదయ్య ఇంటికి తాళం వేసి గొర్రెలు మేపడానికి ,భార్య కూలి పనులకు వెళ్లడంతో ఇంటికి తాళం వేశారు. మధ్యాహ్నం సూమారు రెండు గంటల సమయంలో ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి సందుక పెట్టెలో ఉన్న రూ.53 వేల నగదును దోచుకెళ్లారు. బాధితుడు ఇంటికి వచ్చేసరికి దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## నల్లమలలో పెరిగిన వన్య ప్రాణుల సంఖ్య

చందంపేట : నల్లమల అటవీ ప్రాంతంలో గతంలో పోల్చితే వన్య ప్రాణుల సంఖ్య పెరిగిందని ఎఫ్ఆర్‌వో సాయి ప్రకాశ్ పేర్కొన్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులు, జంతువుల దాహార్తిని తీర్చేందుకు శాసర్ పిట్స్(నీటి తొట్టి)లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెక్ డ్యామ్‌లు, శాసర్ పిట్స్ ద్వారా క్రమక్రమగా నల్లమల అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంఖ్య పెరుగుతున్నట్లు పేర్కొన్నారు. ట్రాప్ కెమెరాల ఆధారంగా వన్య ప్రాణుల గణన జరుగుతుందన్నారు. ఇటీవల ఉమ్మడి చందంపేట మండలాన్ని ఆనుకొని ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కిన వన్య ప్రాణుల ఫొటోలను అటవీ శాఖ అధికారులు విడుదల చేశారు.


నల్లమల అటవీ ప్రాంతంలో తొట్టిలో నీటిని నింపుతున్న సిబ్బంది






అటవీ అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు చిక్కిన వన్య ప్రాణుల చిత్రాలు

## దోపిడీ దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

భువనగిరి : దోపిడీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సత్యనారాయణ వివరాలు వెల్లడించారు. యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన చుంచు బాబు గత ఫిబ్రవరి 26న రాత్రి సమయంలో భువనగిరి పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపం నుంచి ఆటోలో ఇంటికి వెళ్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తి ఆటోను అడ్డగించి చేతులతో కొట్టి, కత్తితో చంపుతానని బెదిరించి తన ఆటోతో పాటు సెల్ ఫోన్‌ను తీసుకునిపోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. దోపిడీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తి మేడ్చల్ జిల్లా ఘటేకేసర్ మండలం అన్నోజిగూడ గ్రామానికి చెందిన గణపురం నిఖిల్‌గా గుర్తించారు. ఇతడు దోపిడీలకు పాల్పడిన కేసులో జైలు జీవితం కూడా గడిపాడు. గత ఫిబ్రవరిలో జైలు నుంచి విడుదలయ్యాడు. పట్టణంలోని అర్బన్‌కాలనీలోని తన బంధువు ఇంటికి వచ్చినట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి రూ.75వేలు విలువ చేసే ఆటో, రెండు సెల్‌ఫోన్లు, కత్తి స్వాధీనం చేసుకున్నారు. నిఖిల్ పై మొత్తం 13 పోలీస్ స్టేషన్లలో 24 కేసులు ఉన్నట్లు చెప్పారు.



# వరిలో జీవశాస్త్ర పద్ధతుల ద్వారా సమగ్ర సస్యరక్షణ

- సూర్యాపేట మండల వ్యవసాయాధికారి ఎండి.జానిమియా సూచనలు

పాడి పంట


గుడ్లను తింటున్న తూనీగ


గుడ్లను తింటున్న అక్షింతల పురుగు

నడిగూడెం : ప్రస్తుత రబీ సీజన్‌లో వరిచేలు పొట్ట దశలో ఉన్నాయి. నిత్యం వరిలో పురుగులు, తెగుళ్లు ఆశించి పంటను నష్టపరుస్తుంటాయి. ఇలాంటి సమయంలో రైతులు రసాయన పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. అయినాగానీ కొన్ని రకాలు పురుగులు నివారణ జరగడంలేదు. ఇలాంటి సమయంలో కేవలం రసాయన మందులను ఉపయోగించకుండా జీవ శాస్త్ర పద్ధతుల ద్వారా చీడ, పీడలను నివారించవచ్చని సూర్యాపేట మండల వ్యవసాయాధికారి ఎండి.జానిమియా చెబుతున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..ఈ దశలో వరి చేల సమగ్ర సస్యరక్షణలో జీవ శాస్త్రపరంగా ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది. ప్రకృతిలో పైర్లకు హాని చేసే పురుగులు, మేలు చేసే పురుగులు ఉన్నాయి. కొన్ని పైర్లకు హాని చేస్తాయి. ఇవి శత్రు పురుగులు. ఈ పురుగులను తినే పురుగులను మిత్ర పురుగులు అంటారు. వరి జీవావరణ వ్యవస్థలో కీడు చేసే పురుగుల కన్నా మేలు చేసే పురుగులే ఎక్కువగా ఉన్నాయి. ఈ పురుగులను మూడు రకాలుగా విభజించవచ్చు. భక్షకాలు (పరాన్న భుక్కులు), బదనికలు (పరాన్నజీవులు), వ్యాధి జనకాలు

- **భక్షకాలు(పరాన్న జీవులు):** హాని కలిగించే పురుగు తల్లి పురుగు, గొంగళి పురుగును గుడ్లనుకాని ఆహారంగా తీసుకుంటాయి. సాలె పురుగు ఇవి వరిని ఆశించే శత్రు పురుగులపైన ముఖ్యమైన భక్షకాలు. పిల్ల, తల్లి సాలె పురుగులు దోమ, కాండం తొలిచే పురుగు, పచ్చదోమ, ఆకుముడత పురుగులను భక్షిస్తాయి. రోజుకు 5-15 శత్రు పురుగులను తింటాయి. ఒక సాలె పురుగు క్రిమిసంహారక మందుల కన్నా ఎక్కువ లాభం చేకూర్చుతుంది.
- **తూనీగలు:** వీటి పిల్ల పురుగులు నీటిపై నుంచి వరి దుబ్బుల పైకిపోయి దోమ పిల్ల పురుగులను తింటాయి. తూనీగలు వరిపైరుపై తిరుగుతూ పచ్చ దోమలను, ఆకు ముడత పురుగు గుడ్లను తింటాయి.
- **నల్లులు:** పచ్చ నల్లులు, తల్లి పురుగులు తల నల్లగా ఉండి, పిల్ల పురుగులు పచ్చగా ఉంటాయి. ఇవి దోమ గుడ్లను దోమలును అమిత ఇష్టంగా తింటాయి. ఒక నల్లి 7-10 గుడ్లను, 2-5 దోమలును ఒక రోజులో తింటాయి.
- **అక్షింతల పురుగు:** పగలు చురుకుగా ఉండి దుబ్బుల పైభాగాన ఉండి ఆకుముడత గుడ్లను తింటాయి. వీటి పిల్ల పురుగులు చురుకుగా ఉండి రోజుకు 5-10 దోమలును తింటాయి.
- **బారు మీసాల మిడత:** దీని మీసాలు శరీర పొడవు కంటే రెట్టింపు ఉంటాయి. ఇవి రాత్రులందు చురుకుగా ఉండి వరినల్లి కాండం తొలిచే పురుగు గుడ్ల సముదాయాన్ని సుడి దోమలును తింటాయి.
- **బదనికలు:** (పరాన్న జీవులు): శత్రు పురుగుల మీద ఆధారపడి దాని గుడ్డు, లార్వా, కోశస్థ దశ మీద గానీ, లోపల గానీ జీవిత చరిత్రను పూర్తి చేసుకొని, వాటిని చంపి, అందులో ఉండి పరాన్న జీవులు బయటకు వస్తాయి.
- **గుడ్లు పరాన్న జీవులు:** ఇవి చిన్న కందిరీగలు. ఇవి ఆకుముడత, కాండం తొలుచు పురుగు గుడ్ల మీద గుడ్డు పెట్టి అందులో పెరిగి జీవిస్తున్న పరాన్న జీవులు బయటకు వస్తాయి.
- **లద్దె పురుగులను ఆశించే పరాన్న జీవులు:** వరి పంటను ఆశించేలార్వాలపై కందిరీగ గుడ్లు పెడుతుంది. ఈ పరాన్న జీవి పిల్ల పురుగులు పంటకి హాని చేసే లార్వాలపై ఆశించి నాశనం చేస్తాయి. ఈ కందిరీగలు 4-7 రోజులు బతుకుతాయి.
- **కోశస్థ దశను ఆశించే పరాన్న జీవులు:** బాక్టీరియా కందిరీగలో ఆకుముడత కోశస్థ దశలో ఆశించి వాటిని నాశానం చేసి, పరాన్న జీవులు బయటకు వస్తాయి.
- **వ్యాధి జనకాలు :** మనుషులకు రోగాలను ఎలిగించే క్రిములున్నట్లే జబ్బులను కల్గించే క్రిములు కూడా ఉన్నాయి. వీటిలో బెవేరియా వంటి బూజు జాతికి చెందిన శిలీంద్రాలు కాండం తొలిచే పురుగు మీద, ఎన్‌పీవి. అనే వైరస్ రెల్లరాల్చు పురుగు మీద వ్యాధులు కలిగించడం వలన అవి చలవ రహితమై నశిస్తాయి. కాబట్టి వరిలో జీవావరణ వ్యవస్థలో ఎన్నో మిత్ర పురుగులు, శత్రు పురుగులను ప్రకృతి సిద్ధంగా నియంత్రిస్తున్నాయి. కాబట్టి రైతులు పైరు తొలి దశలలో పురుగు మందులు వాడకుండా మిత్ర పురుగుల వృద్ధి అయ్యేటట్లు చూడాలి. అందు కోసం రైతులందరూ పొలంబడి కార్యక్రమంలో పాల్గొనాలి.

కనీసం వారానికి ఒక్కసారైనా రైతులు స్వయంగా పొలాల్లో తిరిగి వివిధ దశల్లో పైరు పెరుగుదల, చీడ, పీడల ఉనికిని క్రిమి కీటకాదులను నిశితంగా పరిశీలించి, పొలం పరిసరాల విశ్లేషణ శత్రు, మిత్ర కీటకాల మదింపు చేసుకొని రైతులు ఆర్థిక వ్యయం నిర్ణయం తమ పంటపై తీసుకోవాలి.